లెఫ్ట్ హ్యాండ్.. లక్కీ హ్యాండ్!


బేస్తవారిపేట జెడ్పీ హైస్కూల్లో ఎడమ చేతితో రాస్తున్న విద్యార్థులు

బేస్తవారిపేట:

'కుడి.. ఎడమైతే పొరపాటు లేదోయ్' అన్నారో కవి. నిజమే.. ఎలాంటి పొరపాటు లేదు. రైట్ హ్యాండర్స్‌తో పోలిస్తే ఎడమ చేతి వాటం గల వ్యక్తులు సమాజంలో కాస్త భిన్నంగా కనిపిస్తారు. క్రియేటివ్ ఉద్యోగాల్లోనూ లెఫ్ట్ హ్యాండర్స్ బాగా రాణిస్తారని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. వీరి ప్రతిభ, సృజనాత్మకత, ప్రత్యేకమైన ఆలోచనా విధానాన్ని గుర్తించడమే లక్ష్యంగా 1976 నుంచి ఏటా ఆగస్టు 13వ తేదీన లెఫ్ట్ హ్యాండర్స్ డే సైతం నిర్వహిస్తున్నారు. ఈ దినోత్సవానికి మూలం అమెరికా సైన్యంలో పని చేసిన డీన్ ఆర్ క్యాంప్ బెల్. ఈయనే లెఫ్ట్‌హ్యాండర్స్ ఇంటర్నేషనల్ కంపెనీని స్థాపించారు. ఎడమచేతి వాటం గల వ్యక్తులు ఎదుర్కొంటున్న అసౌకర్యాలపై అవగాహన కార్యక్రమాలు, సమస్యలు అధిగమించేందుకు అవసరమైన ప్రోత్సాహం ఇవ్వడం కూడా లెఫ్ట్ హ్యాండర్స్ డే ప్రత్యేకత.

అడ్డు చెప్పినా అదే చేత్తో..

లెఫ్ట్ హ్యాండర్స్ ఎందుకు అవుతారో శాస్త్రవేత్తలు ఇప్పటికీ కనిపెట్టలేదు కానీ వారి మెదడుపై మాత్రం పరిశోధనలు చేసి ఆసక్తికర విషయాలనే కనుగొన్నారు. ఎడమ చేతితో రాసేవారికి రైట్ సైడ్ బ్రెయిన్ బాగా పనిచేస్తుంది. క్రియేటివిటీ, ఇమేజినేషన్, ఎమోషనల్ ఎక్స్‌ప్రెషన్‌కు రైట్‌సైడ్ బ్రెయిన్ పెట్టింది పేరు. అందుకే లెఫ్ట్ హ్యాండర్స్ క్రియేటివ్ ఉద్యోగాల్లో రాణించడంతోపాటు నాయకత్వ లక్షణాలను మెండుగా కలిగి ఉంటారట! చిన్నతనంలో పిల్లలు ఎడమ చేతితో పనులు చేస్తుంటే తల్లిదండ్రులు సహజంగానే అడ్డు చెబుతారు. పదే పదే చెప్పడంతో కొందరు తమ తీరు మార్చుకుంటారు. మరికొందరు అలాగే ముందుకు సాగి ఎడమచేతి వాటంగానే ఉండిపోతారు. అలా ఉండటంతో తమ సత్తా చూపడానికి అడ్డంకేమీ కాదని, అలవాటు చేసుకుంటే ఎడమ చేత్తోనైనా అన్ని పనులూ చక్కగా చేయవచ్చని పలువురు నిరూపిస్తున్నారు. బేస్తవారిపేట జెడ్పీ హైస్కూల్లో దాదాపు 30 మంది విద్యార్థులు లెఫ్ట్ హ్యాండర్స్. బుధవారం లెఫ్ట్ హ్యాండర్స్ డే అని తెలుసుకుని వారంతా మురిసిపోయారు.

మీకు తెలుసా?

- ప్రపంచ జనాభాలో సుమారు పది శాతం మంది లెఫ్ట్ హ్యాండర్స్ ఉన్నట్లు అంచనా.
- అమెరికా మాజీ ప్రెసిడెంట్లు బిల్ క్లింటన్, బరాక్ ఒబామా. చంద్రుడిపై మొదటిసారి కాలు మోపిన నీల్ ఆర్మ్ స్ట్రాంగ్, ప్రఖ్యాత శాస్త్రవేత్త ఆల్బర్ట్ ఐన్‌స్టీన్, విఖ్యాత హాస్య నటుడు చార్లీ చాప్లిన్, యాపిల్ కంపెనీ అధినేత స్టీవ్ జాబ్స్, మైక్రోసాఫ్ట్ అధినేత బిల్‌గేట్స్, క్రికెటర్ సచిన్ టెండూల్కర్, రతన్‌టాటా తదితరులంతా లెఫ్ట్ హ్యాండర్సే.
- జాతిపిత మహాత్మ గాంధీ, ప్రధాని నరేంద్ర మోదీ, బాలీవుడ్ స్టార్ అమితాబ్ బచ్చన్‌కు రెండు చేతులతో రాయగల సామర్థ్యం ఉంది. ఇలాంటి లక్షణాన్ని యాంబీడెక్స్ ట్రస్ అంటారు.

అన్నదమ్ములిద్దరం ఎడమ చేతి వాటమే..



నాకు చిన్నతనం నుంచే ఎడమచేతితో రాయడం అలవాటు అయింది. మా తమ్ముడు లాయర్ బండ్లమూడి విజయకుమార్ కూడా లెఫ్ట్ హ్యాండరే. మేము మిగిలిన పనులన్నీ కుడిచేతితో చేస్తాం. ఎడమ చేతితో మాత్రం చూడముచ్చటగా అక్షరాలు రాస్తాం. మా తల్లిదండ్రులకు ఎడమచేతితో రాసే అలవాటు లేదు. ఎందుకో తెలియదు కానీ ఆ అలవాటు మాకు వచ్చింది.

– బండ్లమూడి చింపిరయ్య బాబు, కంభం సబ్ రిజిస్ట్రార్

చిన్నతనం నుంచే అలవాటు



ఎడమ చేతితో రాయడం చిన్నప్పటి నుంచే అలవాటు. అందరూ కుడిచేతితో రాసినట్టే నేను ఎడమ చేతితో వేగంగా రాయగలను. ఒకటో తరగతి నుంచే ఎడమ చేతితో రాస్తున్నాను. ఇప్పుడు పూర్తిగా అలవాటుపడిపోయా.

– సీహెచ్ చంద్రమల్లిక, ఆరో తరగతి, బేస్తవారిపేట జెడ్పీ హైస్కూల్

వేగంగా రాయగలను



నేను ఇంట్లో అన్ని పనులు ఎడమచేతి వాటంగానే చేస్తాను. కుడిచేతి వాటానికి, ఎడమచేతి వాటానికి తేడా ఏమీ లేదు. ఎడమ చేతితో నేను వేగంగా రాయగలను. ఇంట్లో వాళ్లు మొదట్లో చేతివాటం మార్చుకోమని చెప్పారు. నాకు ఎడమ చేతితో రాయడం అనుకూలంగా ఉంటుంది.

– జి.శృతి, పదో తరగతి, బేస్తవారిపేట జెడ్పీ హైస్కూల్

దుకాణాలు దూరం.. కార్డుదారులకు భారం!

- అస్తవ్యస్తంగా తయారైన రేషన్ పంపిణీ వ్యవస్థ
- కూటమి కుట్రల్లో భాగంగా లింగోజిపల్లిలో రేషన్ షాప్ సీజ్
- 5 కి.మీ దూరంలోని ఎల్.కోటలో సరుకులు తెచ్చుకోలేక సూరేపల్లి వాసుల తంటాలు
- కంభం మండలంలోని మరికొన్ని గ్రామాల్లో ఇదే పరిస్థితి
- రేషన్ నరుకులు ఇంటి వద్దే ఇవ్వాలని కార్డుదారుల డిమాండ్

కంభం:

సజావుగా సాగుతున్న రేషన్ పంపిణీ వ్యవస్థను కూటమి ప్రభుత్వం తిరోగమనంలోకి నెట్టింది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఇంటి వద్దకే రేషన్ సరుకులు అందించేందుకు ఏర్పాటు చేసిన ఎండీయూ వాహనాలను రద్దు చేయడమే కాకుండా టీడీపీ, జనసేన కార్యకర్తలను అడ్డదారుల్లో డీలర్లుగా నియమించడం, కొందరు డీలర్లపై వైఎస్సార్ సీపీ ముద్ర వేసి అక్రమంగా 6ఏ కేసులు నమోదు చేయడంతో రేషన్ పంపిణీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. కూటమి ప్రభుత్వ విధానాలతో ఒరిగిందేమీ లేకపోగా అదనపు వ్యయ ప్రయాసలు భరించాల్సి వస్తోందని కార్డుదారులు గగ్గోలు పెడుతున్నారు. రేషన్ సరుకుల కోసం దుకాణాల వద్ద పడిగాపులు కాయాల్సి వస్తోందని, పక్క గ్రామాలకు ఆటోలు, బైకులపై వెళ్లి తెచ్చుకోవాల్సి వస్తోందని వాపోతున్నారు.


లింగోజిపల్లిలో ఇటీవల సీజ్ చేసిన రేషన్ దుకాణం

ముందు వెళ్లేనే బియ్యం

కంభం మండలంలో 14 పంచాయతీల్లో 31 రేషన్ దుకాణాల పరిధిలో 12,838 కార్డుదారులు ఉన్నారు. వీరిలో 65 ఏళ్లు పైబడిన వారు, దివ్యాంగులు 1504 మంది ఉండగా డీలర్లు డోర్ డెలివరీ ఇవ్వాల్సి ఉంది. కంభం మండలంలోని ఎల్‌కోట పంచాయతీ పరిధిలోని 200 కుటుంబాలు ఉన్న సూరేపల్లి గ్రామస్తులు సుమారు 3 కిలోమీటర్ల దూరంలో ఉన్న లింగోజిపల్లి వెళ్లి రేషన్ సరుకులు తెచ్చుకుంటున్నారు. వైఎస్సార్ సీపీ సానుభూతి పరుల రేషన్ షాపులను టార్గెట్ చేసి వాటిని తొలగించే ప్రయత్నాలు చేస్తున్న క్రమంలో భాగంగా గత వారం లింగోజిపల్లిలోని రేషన్ దుకాణాన్ని సీజ్ చేసినట్లు సమాచారం. అయితే అధికారులు అక్కడ ప్రత్యామ్నాయ మార్గం ఏర్పాటు చేయకపోవడంతో లింగోజిపల్లి వాసులు మరో 2 కి.మీ అదనంగా.. అంటే మొత్తం 5 కి.మీ ప్రయాణించి ఎల్‌కోట గ్రామానికి వెళ్లాల్సి వస్తోంది. ఇదిలా ఉండగా ఎల్‌కోటలో ఉన్న రేషన్ దుకాణానికి అక్కడ ఉన్న కార్డుల సంఖ్య ప్రకారం బియ్యం రావడంతో అవి స్థానికులకే సరిపోతున్నాయి. ముందుగా వెళ్లేనే బియ్యం అందుతున్నాయని, లేదంటే బియ్యం లేవని వెనక్కి పంపిస్తున్నారని సూరేపల్లి వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇష్టారీతిగా షాపులు

ఔరంగబాద్, తెల్లదిన్నె, నడింపల్లి గ్రామల ప్రజలు రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న ఎల్ కోటకు వెళ్లి రేషన్ సరుకులు తీసుకోవాల్సి వస్తోంది. చిన్ననల్ల కాల్వ ప్రజలు రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న యర్రబాలేనికి, హజరత్ గూడెం ఎస్సీ కాలనీ వాసులు రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న రావిపాడు వెళ్లి సరుకులు తెచ్చేకోలేక యాతన పడుతున్నారు. మేజర్ పంచాయతీలైన కంభం, కందులాపురంలో సైతం రేషన్ షాపులు తమ హద్దుల్లో కాకుండా ఇష్టానుసారంగా ఏర్పాటు చేయడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.

బియ్యం ఇంటి వద్ద ఇవ్వాలి



మా ఆయన కూలీ పనికి వెళ్తాడు. గతంలో రేషన్ సరుకులు ఇంటి వద్ద ఇస్తుండటంతో ఇబ్బంది ఉండేది కాదు. రేషన్ వాహనాలు తొలగించడంతో మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న లింగోజిపల్లికి వెళ్లాల్సి వస్తోంది. ఈ సారి అక్కడ కూడా షాపు లేదని చెప్పడంతో 5 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఎల్‌కోటకు వెళ్లి నా భర్త బియ్యం తెచ్చాడు.

– అంబడిపూడి భాగ్యం, సూరేపల్లి

బియ్యం ఇంకా తెచ్చుకోలేదు



మేము కూలీ పనులు చేసుకుని బతికేటోళ్లం. ఈ సారి బియ్యం 5 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఎల్‌కోటకు వెళ్లి తెచ్చుకోమంటున్నారు. అక్కడ కూడా బియ్యం అయిపోయాయని చెబుతున్నారు. ఈ సారి బియ్యం ఇస్తారో లేదో తెలియడం లేదు.

– యేసమాలరాణి, సూరేపల్లి

ఆటోలో వెళ్లి తెచ్చుకున్నా



మా ఊరికి 5 కి.మీ దూరంలో ఉన్న ఎల్‌కోటకు ఆటోలో వెళ్లి బియ్యం తెచ్చుకున్నా. ఆటో చార్జీలకు రూ.40 ఖర్చు అయింది. అంత దూరం వెళ్లి బియ్యం తెచ్చుకోవాలంటే ఇబ్బందిగా ఉంది. మా గ్రామంలోనే రేషన్ షాపు పెట్టడమో లేదంటే ప్రతి నెలా మా ఊరికే వచ్చి రేషన్ అందించడమో చేయాలి.

– సాలమ్మ, సూరేపల్లి

దివ్యాంగురాలిపై దాడి అమానుషం

పొదిలి: బాపట్ల జిల్లా కారంచేడు మండలంలో దివ్యాంగురాలు పొదిలి దేవికపై దాడి అమానుషమని, తీవ్రంగా ఖండిస్తున్నామని నవ్యాంధ్ర వికలాంగుల హక్కుల సేవా సమితి అధ్యక్షుడు ముల్లా మదార్‌వలి ఒక ప్రకటనలో తెలిపారు. దేవికపై కనికరం లేకుండా ఇనుపరాడ్లు, కర్రలతో దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. నిందితులపై దివ్యాంగుల హక్కుల చట్టం–2016 ప్రకారం చర్యలు తీసుకోవాలని, ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని అధికారులను కోరారు.

సచివాలయ సిబ్బంది బాధ్యతగా పనిచేయాలి


ఉద్యోగులతో ఫోన్‌లో మాట్లాడుతున్న కమిషనర్

పొదిలి: సమయపాలన పాటించని సచివాలయ ఉద్యోగులపై ఉన్నతాధికారులకు నివేదికలు పంపిస్తున్నట్లు నగర పంచాయతీ కమిషనర్ నారాయణ రెడ్డి పేర్కొన్నారు. పొదిలి 5వ సచివాలయం పరిధిలోని రైతు సేవా కేంద్రాన్ని బుధవారం ఆయన తనిఖీ చేశారు. అక్కడ ఖాళీ కుర్చీలు దర్శనమివ్వటంతో ఉద్యోగుల పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు.

పాఠశాలకు ఫ్యాన్లు వితరణ


ఫ్యాన్లు అందజేస్తున్న బ్యాంక్ మేనేజర్

బేస్తవారిపేట: మండలంలోని పాత మల్లాపురం మోడల్ ప్రైమరీ పాఠశాలకు బుధవారం బేస్తవారిపేట బ్యాంక్ ఆఫ్ బరోడా మేనేజర్ శ్రీకాంత్ మూడు ఫ్యాన్లు అందజేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు దాతలు చేయూతనివ్వడం అభినందనీయమని పాఠశాల హెచ్‌ఎం వైజా మధుసూదన్‌రెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కోటేశ్వరరావు, కృష్ణ, బ్యాంక్ సిబ్బంది అచ్చయ్య, చింటూ పాల్గొన్నారు.

వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలి

మార్కాపురం టౌన్: అల్ప పీడనం ప్రభావంతో వర్షాలు కురుస్తున్నందున ప్రజలతోపాటు మండల స్థాయి అధికారులు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ చిరంజీవి సూచించారు. బుధవారం ఆయన తన కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ.. గత రెండు రోజులుగా మార్కాపురం ప్రాంతంలో వర్షాలు కురుస్తున్నాయని, లోతట్టు ప్రాంతాల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని, గుండ్లకమ్మతోపాటు వాగులువంకలు పొంగి ప్రవహిస్తున్నప్పుడు రోడ్లు దాటవద్దని ప్రజలకు సూచించారు. ఎక్కడ ఇబ్బంది వచ్చినా రెవెన్యూ అధికారులను ఫోన్ చేయాలని విజ్ఞప్తి చేశారు.

విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు

మార్కాపురం: కృష్ణాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని మార్కాపురంలోని బ్రహ్మకుమారి ఓంశాంతి వారి ఆధ్వర్యంలో బుధవారం వివిధ పాఠశాలల విద్యార్థులకు శ్రీకృష్ణుడిపై డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. విజేతలకు ఈనెల 18న నిర్వహించే కార్యక్రమంలో బహుమతులు అందజేస్తామని బ్రహ్మకుమారి సరస్వతి, సాయికృష్ణ, వెంకటేశ్వర్లు తదితరులు తెలిపారు.

జార్జి కాలేజీకి యూజీసీ 12బీ గుర్తింపు


మాట్లాడుతున్న మాజీ మంత్రి సురేష్

మార్కాపురం: జిల్లాలో మొదటిదైన మార్కాపురం పట్టణంలోని డాక్టర్ సామ్యేల్ జార్జి ఇంజినీరింగ్ కళాశాలకు యూజీసీ(యూనివర్సిటీ గ్రాంట్ కమిషన్) 12బీ గుర్తింపు దక్కిందని కాలేజీ టెక్నికల్ అడ్వయిజర్, మాజీ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ వెల్లడించారు. బుధవారం కళాశాలలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో యూజీసీ 12బీ గుర్తింపు దక్కించుకున్న మూడో కాలేజీ తమదని, పరిశోధనలు, నూతన ఆవిష్కరణలకు యూజీసీ నిధులు మంజూరు చేస్తుందని చెప్పారు. ఏడాది వ్యవధిలో కళాశాలకు నాక్, అటానమస్‌తోపాటు 12బీ గుర్తింపు రావడం తాము పడిన కష్టానికి ప్రతిఫలమన్నారు. త్వరలో డీమ్డ్ యునివర్సిటీగా కళాశాలకు గుర్తింపు రానుందని చెప్పారు. టెన్త్ క్లాస్ ఉత్తీర్ణులైన వారు తమ కళాశాలలో ఐటీఐ, పాలిటెక్నిక్, ఇంజినీరింగ్, ఎంటెక్, పీహెచ్‌డీ వరకూ చదువుకోవచ్చని తెలిపారు. తన తండ్రి డాక్టర్ శామ్యూల్ జార్జి ఆశయాలను కొనసాగిస్తూ నాణ్యమైన విద్య అందిస్తున్నామని, పేద విద్యార్థులకు ఫీజులో రాయితీలు ఇస్తున్నామని తెలిపారు. త్వరలో రెసిడెన్షియల్ ఇంజినీరింగ్ కళాశాల కూడా ఏర్పాటు కానుందని, అన్ని విభాగాల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ను ప్రవేశపెడుతున్నామన్నారు. సమావేశంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఈశ్వరరావు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రాజబాబు, హెచ్‌ఓడీలు మస్తానయ్య, ఎస్‌డీ ఖాశిం, కె.దానియేల్ తదితరులు పాల్గొన్నారు.

రెండు ఉపఎన్నికలు రద్దు చేయాలి

- మాజీ ఎమ్మెల్యే జంకె వెంకటరెడ్డి డిమాండ్


మాట్లాడుతున్న జంకె వెంకటరెడ్డి

మార్కాపురం: వైఎస్సార్ కడప జిల్లా పులివెందుల, ఒంటిమిట్ట జెడ్పీటీసీ సభ్యుల ఉప ఎన్నికలను తక్షణమే రద్దు చేయాలని రాష్ట్ర ఎలక్షన్ కమిషన్‌ను వైఎస్సార్‌సీపీ నెల్లూరు పార్లమెంట్ పరిశీలకుడు, మాజీ ఎమ్మెల్యే జంకె వెంకటరెడ్డి డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యం ఒక్కసారి చేజారిపోతే అక్కడి నుంచే ఫ్యాక్షనిజం పుడుతుందని, ప్రమాదకర పరిస్థితులకు మీరే పునాదులు వేస్తున్నారని టీడీపీపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలింగ్ బూత్‌ల్లో బహిరంగంగా రిగ్గింగ్‌కు పాల్పడిన నేపథ్యంలో ఎలక్షన్ కమిషన్ కళ్లు తెరిచి ఆ రెండు ఉప ఎన్నికలు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర బలగాల పర్యవేక్షణలో ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికలు నిర్వహించాలని సీఎం చంద్రబాబుకు హితవుపలికారు.

ఆర్టీసీ స్థలాలు లూలూ సంస్థకు కట్టబెట్టొద్దు

- ఎన్‌ఎంయూ, ఎన్‌జీఓ నాయకుల డిమాండ్


డిపో వద్ద ధర్నాలో మాట్లాడుతున్న యూనియన్ నాయకులు

మార్కాపురం టౌన్: విజయవాడలోని గవర్నర్‌పేట 1, 2 ఆర్టీసీ డిపోలకు చెందిన 4.5 ఎకరాల భూమిని లూలూ అనే ప్రైవేట్ కంపెనీకి ఇవ్వడాన్ని వెంటనే ఆపాలని నేషనల్ మజ్దూర్ యూనియన్, ఎన్‌జీఓ నాయకులు శాస్త్రి, కిరణ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం ఎన్‌ఎంయూ ఆధ్వర్యంలో మార్కాపురం డిపో వద్ద నిర్వహించిన ధర్నాలో వారు మాట్లాడారు. విద్యుత్ బస్సులను ప్రైవేట్ వ్యక్తులు నిర్వహించడం వల్ల సంస్థ క్రమేపీ ప్రైవేట్‌పరమవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఆర్టీసీ సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలను పది నెలలుగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారానికి నోచుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పెండింగ్‌లో ఉన్న ప్రమోషన్లు, గ్యారేజీ సిబ్బందికి 12 సంవత్సరాల ఇంక్రిమెంట్‌ను వెంటనే అమలు చేయాలన్నారు. ఆగస్టు 15 నుంచి రాష్ట్రంలో అమలవుతున్న ఫ్రీ బస్సుల విషయంలో సిబ్బందికి కలుగుతున్న ఇబ్బందులపై ప్రభుత్వం ఇప్పటి వరకు స్పందించకపోవడం సరికాదన్నారు. పెండింగ్ డీఏలు, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్‌ను వెంటనే చెల్లించాలని, 12వ పీఆర్సీ కమిషన్ వేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎన్‌ఎంయూ రీజినల్ నాయకులు టి.మల్లికార్జునరావు, బి.నాగిరెడ్డి, బి.శ్రీనివాసరెడ్డి, జోనల్ నాయకులు దస్తగిరి, సీహెచ్ శ్రీనివాసులు, సత్యనారాయణరెడ్డి, సలీం, డిపో ఉద్యోగులు పాల్గొన్నారు.

నిండుకుండలా చెరువులు


జలకళ సంతరించుకున్న ఆకవీడు తురకవాని చెరువు

రాచర్ల: నల్లమల అటవీ ప్రాంతంలో రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో గుండ్లకమ్మ పరవళ్లు తొక్కుతోంది. రామన్నకతువ నుంచి దిగువకు ప్రవహిస్తున్న నీటితో ఆకవీడులోని తురకవాని చెరువు, దొడ్డేని చెరువులు నిండి అలుగు పారుతున్నాయి. అచ్చంపేటలోని ప్రధాన నీటి కుంట జలకళ సంతరించుకుంది. దీంతో ఆయా గ్రామాల రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా చినగానిపల్లెలోని రంగయ్యనాయుడు చెరువుకు చుక్క నీరు చేరడం లేదు. గుండ్లకమ్మ ప్రవహిస్తే ఒక్కరోజులోనే నిండే ఈ చెరువుకు పంట కాలువలు సక్రమంగా లేకపోవడంతో నీరు చేరడం లేదని రైతులు చెబుతున్నారు. ఇరిగేషన్ అధికారులు స్పందించి పంట కాలువకు మరమ్మతులు చేయించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.


కంభం వైపు పరవళ్లు తొక్కుతున్న గుండ్లకమ్మ

అనుమతి లేని ఎరువుల విక్రయం నిలిపివేత

మార్కాపురం: మార్కాపురం మండలంలోని చింతగుంట్ల గ్రామంలో అనిల్ ఫెర్టిలైజర్ షాపులో అనుమతి లేకుండా విక్రయిస్తున్న 74,400 రూపాయల విలువగల ఎరువులను సీజ్ చేసినట్లు ఏడీఏ బాలాజీ నాయక్ తెలిపారు. బుధవారం సాయంత్రం ఆయన ఏఓ బుజ్జిబాయితో కలిసి దుకాణాలను తనిఖీ చేశారు. అనంతరం మార్కాపురంలోని తన కార్యాలయంలో నిర్వహించిన డీలర్ల సమావేశంలో ఏడీఏ మాట్లాడుతూ.. యురియా అమ్మకాన్ని ప్రభుత్వం నిర్ణించిన ధర కాకుండా అధిక ధరకు అమ్మినా, కల్తీ ఎరువులు విక్రయించినా, ఎరువులు కొనుగోలు చేసిన వారికి రసీదు ఇవ్వకపోయినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ప్రజలపై అదనపు విద్యుత్ భారం


మాట్లాడుతున్న సీపీఎం నాయకుడు బాలకోటయ్య

గిద్దలూరు రూరల్: కూటమి ప్రభుత్వం రాష్ట్ర ప్రజలపై విపరీతమైన విద్యుత్ చార్జీల భారం మోపుతోందని సీపీఎం జిల్లా నాయకుడు వి.బాలకోటయ్య పేర్కొన్నారు. బుధవారం స్థానిక సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రెండు పర్యాయాలు విద్యుత్ భారాలు మోపిందన్నారు. అదానీ స్మార్ట్‌మీటర్లను గృహాలకు బిగించడాన్ని ప్రజలు వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. ఇప్పటికే వ్యాపార సంస్థలు, పరిశ్రమలు, ప్రభుత్వ కార్యాలయాలకు స్మార్ట్ మీటర్లు బిగించేశారన్నారు. గృహాలకు బిగించేందుకు కూటమి ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన కేబినేట్ సమావేశంలో నిర్ణయం తీసుకోవడాన్ని తప్పుబట్టారు. ప్రజలు, ప్రజాసంఘాలు ఆందోళన చేస్తున్నా పట్టించుకోకుండా ప్రభుత్వం ఏకపక్ష వైఖరి అవలంబిస్తోందని ఆక్షేపించారు. సమావేశంలో సీపీఎం నాయకులు ఆవులయ్య, నరసింహులు, పూర్ణ తదితరులు పాల్గొన్నారు.

సాహితీ ప్రియులకు వేదిక 'అనేక'


సమావేశంలో పాల్గొన్న కవులు

మార్కాపురం: మార్కాపురం ప్రాంతంలోని సాహితీ ప్రియుల కోసం 'అనేక' పేరుతో సాహితీ వేదికను శ్రీవిద్య కోచింగ్ సెంటర్‌లో ఏర్పాటు చేసినట్లు పలువురు కవులు తెలిపారు. సాహితీ ప్రియులైన మిత్రులు ఒక చోట కలుసుకునేందుకు, నచ్చిన పుస్తకాల గురించి మాట్లాడుకోవడానికి, స్వీయరచనలపై చర్చించేందుకు ఈ వేదిక ఏర్పాటు చేసినట్లు కవులు చక్కికం శ్రీధర్, మంత్రి కృష్ణమోహన్, ఒ.రవిశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం నిర్వహించిన సమావేశంలో మహమ్మద్ ఖదీర్‌బాబు రచించిన దర్గామిట్ట కథలు పుస్తకాన్ని పవని భానుచంద్రమూర్తి పరిచయం చేశారు. ఆరుద్ర శత జయంతి సందర్భంగా కూనలమ్మ పదాలు విశేషాలను మంత్రి కృష్ణమోహన్ ముచ్చటించారు. సమావేశంలో కవులు ఎస్‌వీ సుబ్బారెడ్డి, రఫీ తదితరులు పాల్గొన్నారు.